
*సమాజంలో మనం చూస్తున్న సామాన్యుల్లోనే అసామాన్యమైన త్యాగం వుంది. సాహిత్యంలో శాశ్వతమై నిలిచిన పాత్రలకంటే ఆ వ్యక్తులు తక్కువేమీకాదు, గుర్తించేవాళ్ళు కొరతేగానీ!*

# నాదేదీ కవితకనర్హం...?

జె. భాగ్యలక్ష్మి



రాత్రి పది గంట లయింది. ఇంతవరకు ఏకాగ్రతతో చదివానేమో కళ్ళు మంటలు పుడుతున్నాయి. నిద్ర కూరుకొస్తోంది. లైటు ఆర్పి పడుకొన్నాను. నిద్ర వెంటనే పట్టేసింది. ఇంతలో పెద్ద పెద్దగా కేకలు, అరుపులు - ఉలిక్కిపడి లేచాను. ఏమయిందో ఒక్క క్షణం అర్థం కాలేదు. లేచి కిటికీ వద్దకు వెళ్ళి చూశాను. వీధి కవతల చాకలి వాళ్ళ గుడిసెల ముందు దెబ్బలాట........... కాదు తిట్లాట జరుగుతుంది. ఆ ఆట చూసే ఓపికలేదు. వినే ఓపిక అంతకంటే లేదు. రాత్రి నిశ్శబ్దమేమో వాళ్ళు గొంతెత్తి అరుచుకొనే అరుపులు ఫుల్ వాల్యూమ్‌లో వున్న రేడియోలా వినిపిస్తున్నాయి. నిద్రకూడా భయపడి పారిపోయింది. కొద్దిగా గ్రుడ్డి వెన్నెల కాస్తోంది. బయటకు వెళ్దామా అనుకొన్నాను. కాని నిద్రపోతే బాగుండునని పిస్తోంది. తిరిగిపక్కమీద పడుకొన్నాను.

రాములు, వానితో వుండే రాములమ్మ ఇద్దరూ వాగ్వివాదాలు చేసుకొంటున్నారు. చెవుల్లో వేళ్ళు దూర్చుకొని పడుకొన్నా వాళ్ళ అనర్గళ పదజాలం నన్ను నిలువునా కదిలించివేస్తోంది. కంపరం పుట్టించే ఆ మాటలు....మా ఎకనమిక్స్ లెక్చరర్ అంటుంటారు. లోకంలో ఇన్ని మంచి మాటలు, అందమైన శబ్దాలు ఉండగా బూతుమాటలు ఎందుకు వాడాల్సి వస్తుందని. శబ్దానికి శక్తిఉందికదా అందుకని కాబోలు. మంచి మాటలకు మంచి ఫలితం. చెడ్డమాటలకు చెడు ఫలితం. అందుకే కలుగుతుంటాయి.

అదే ఇప్పుడు రాములమ్మ సాధిస్తోంది. అపురూపమైన తిట్లన్నీ అస్త్రాలుగా ఉపయోగించుకొన్న తర్వాత మహారథులిద్దరూ ఆర్గ్యుమెంటులోకి దిగారు.

"నా ఇష్టం. నా రాజ్జెం. మద్దె నీదేంది పెత్తనం. నువ్వేం తాళిగట్టినోడివా?"

"తాలి గట్టాలంటే.... నా దగ్గర నీ యేసాలు సాగవ్. ఈనాడు నేనంటే మొగం మొత్తిందా? ఈరిగాడు నాకంటే బాగా...."

"ఈరిగాని మాట నీకెందుకంట. నేను కట్టపడతా. నాతిండి తింటా. నా ఇష్టమొచ్చినట్టుంటా. ఆ చౌడిమీద సూపుకోని పెతాపం. నాదగ్గర పప్పులుడకవ్."

"నోరు జారకే.. ఆనాడు నేను....పోతే నీకు దిక్కేలేదు. ఈనాడు ఈరిగాడు దొరికాడు నీ బతుక్కి...."

"ఎదవ మాటలూ నువ్వూ. తాగి సచ్చినోడివి నోరు మూసుకు పడుకోక ఈ సంతేమిటంట"

"సంతంటావే....సంత....నీ ఎముకలిరగ్గొడితే"

"ఓలమ్మో సస్తినే. నీకేం పోగాలమొచ్చిందిరా. నీ సేతులు పడిపోనూ...."

రాములమ్మ తన పంచాంగం విప్పింది. ఆ మాటలు విషసర్పాలులా బుసలు కొడుతున్నాయి. రాములుగాడు తన భారతం విప్పాడు. ఆ మాటలు అగ్నిజ్వాలలులా దహిస్తున్నాయి. ఆ గదిలో ఒక్క క్షణం వుండలేననిపించింది. గది మారాలని ఎన్నాళ్ళుగానో ప్రయత్నం. ఇంతవరకు కలిసి రాలేదు. నేనెప్పుడో ఈ వాతావరణంలో పిచ్చివాణ్ణి అవుతాను.

సగటున వారానికి ఒకసారయినా చాకలిండ్లలో మహా సంగ్రామం జరుగకపోదు. ఆ రాత్రల్లా నాకు జాగరణా తప్పదు. సుబ్బారావు తన రూమ్‌మేటుగా రమ్మంటాడుగాని వాని పాలిష్డ్ అలగాతనం నాకు నచ్చదు.

చెప్పులేసుకొని ఈసురోమనుకొంటూ సోమసుందరం గదికి బయలుదేరాను. వాడు మేల్కొన్నాడో. నిద్రపోయాడో. గదిలో ఉన్నాడో లేదో! రాములు, రాములమ్మల కేకలకు, తిట్లకు, మధ్యవర్తుల తీర్పులకు దూరంగా.సోమసుందరం గదికి వెళ్ళి తలుపు తట్టాను.

దేవుడి దయవల్ల వాడింకా మేల్కొనే వున్నాడు. సైన్సు ముఖం. ఏదో రికార్డులు గిలుకుతూనే వుంటాడు.

"ఏమిలా వేంచేశావు. టీకి వెళ్దామనా?" అన్నాడు తలుపు తీస్తి.

"కాదురా. ఈ రాత్రికి ఇక్కడ పడుకుందామని."

"అదేం, నీ గదిలో ఎవరైనా గెస్టు లొచ్చారా?"

"ఎవరూ రాలేదు. ఎదురుగా చాకళ్ళ పోరు-ఇంక నేను భరించలేనురా. ఎక్కడైనా రూమ్ చూసిపెట్టు. ఒక్కణ్ణే ఉంటాను. రూమ్‌మేటు వద్దు."

"సరే రేపు చూద్దాంలే. ఆ మంచంమీద పడుకో నిద్రొస్తుంటే. నాకింకా బోలెడంత రికార్డు వర్కుంది. లైటుంటే ఫర్వాలేదా?"

"బెగ్గర్స్ ఆర్ నాట్ చూజర్స్. నీ పని నీవు చేసుకో" అని మంచంమీదవాలి కళ్ళు మూసుకొన్నాను. కళ్ళు మండుతున్నాయికాని నిద్ర పట్టదే. రాములమ్మ. రాములుగాడు....వాళ్ళ మాటలు..

ఎక్కడ గాడిద కూస్తోంది, ఈ గాడిదలు ఎక్కడబడితే అక్కడే ఎదురవుతాయి ఈ ఊర్లో. స్కూల్లో చదివే రోజుల్లో నా ఫ్రెండు రాజు, గాడిద కూతలోని పరమ రహస్యం తెలిపాడు. మొదట "అల్లా" అంటుందట. ఆ తర్వాత "షైకి, నైకి, షైకి, నైకి, షైకి, నైకి" అని "హై, హై, హై" అంటుందట. ఆ రోజుల్లో నిజంగా నమ్మేవాడిని. ఇప్పటికీ గార్దభ స్వరం అలాగే రిథమిక్‌గా విని పిస్తుంది.

తిరిగి రాములమ్మ మనసులో మెదిలింది. నా మనసుకూడా పచ్చిది. లోకంలోని అన్ని విషయాలూ దానికే కావాలి. ఆర్నెల్లయింది. నేనా రూంలో చేరి. చేరిన రెండోరోజే రాములు భార్య చౌడమ్మ వచ్చింది బట్టలుతుకుతానంటూ. మూడో రోజు రాములమ్మ వచ్చింది. 'నేను సక్కంగా ఉతుకుతాను. ఆ చేడమ్మకంటే రెండ్రూపాయలు తక్కువకే ఉతుకుతాను. తెల్లంగా మెరిసిపోవాల. నా సామిరంగా ఉతికి గెంజి పెట్టానంటె పాతబట్టలు కొత్తవి కావూ." అంది.

"నాపని నచ్చకపోతే రాగిదమ్మిడీవద్దు. పన్జూసి దుడ్డివ్వండి." అంది. చౌరవగా రెండు షర్టులు. పైజమాలు పట్టుకొనిపోయింది ఉతక్కొస్తానంటూ. ఆ మరుసటి రోజు చౌడమ్మవచ్చి పెద్ద హంగామా చేసిపోయింది. రాములమ్మను నానాతిట్లూ తిట్టింది. నాకు ఒళ్ళుమండి నా గదినుంచి బయటకు వెళ్ళమన్నాను.

పది నిమిషాల్లో చాకలిగుడిసెల్లో కురుక్షేత్రం. రాములమ్మ, చౌడమ్మ నీవెంత అంటే, నీవెంత అనుకొంటున్నారు, వాగ్వివాదాలు చేసుకొన్నారు, జుట్టూ జుట్టూ పట్టుకొన్నారు. నేను రూముకు తాళంవేసి మెస్సుకు వెళ్ళిపోయాను.

ఆ సాయంత్రం రాములొచ్చాడు. "మీరు బట్టలు రాములమ్మ కేయండి. చౌడికి నోరెక్కువ. పని సేతకాదు" అంటూ బూతులు తిట్టాడు.

"నీకు రాములమ్మ ఏమవుతుంది?" అన్నాను.

"పిలుచుకొచ్చాను దొంగ.... తిప్ప సంద్రం తిరనాలలో నా యెంటబడింది. మొగుడు లేడు."

"మరి చౌడమ్మ?"

"దాందేందిలే. బొట్టుకట్టిన పెండ్లాం. ఎప్పుడూ నోరు చించుకొంటుంది. నాలుగు తగల్నిస్తే కుయ్యో మొర్రో అంటుంది. పైగా మూర్ఛరోగం - పనీ పాటూ రాదు. తిని కూర్చుంటుంది. వట్టి ఎనుము...."

"రాములమ్మ ఎక్కడుంటుంది."

"దానికేం కట్టపడుతుంది. నాలుగిండ్లలో తిండి దొరుకుతుంది. ఎగవన గుడిసేసిస్తే రెండు గాడ్డిలు కొనిస్తి. ఇప్పుడు నాకు సారాయిబుడ్డి ఖర్చులిస్తుంది కమ్మగా వొండి పెట్టుంది."

మొత్తానికి రాములమ్మ పని బాగా చేస్తుంది. సైముకు బట్టలుతికి తెస్తుంది ఏపీ పారెయ్యదు. చింపుకొనిరాదు. రోజూ గది ఊడ్చి, కూజాలో నీళ్ళుకూడా పెత్తే మరో రెండు రూపాయలిస్తానన్నాను.

"సాకలోల్లం. సాకలి పని చెప్పండి. మీకు కులం వద్దకపోయినా మాకు గావాల. నేను బెట్టిన నీల్లు మీరు తాగితే ఆ పాపం నాకు సుట్టుకొంటుంది." మొత్తానికి తనే ఇంకొక పనిమనిషిని కుదిర్చిపెట్టింది.


అప్పుడప్పుడు రాములు రాములమ్మను కూడా తంతుండేవాడు. ఆమె వచ్చినప్పుడు అడిగితే "ఏముందిలే మాలాంటోల్లకు మామూలే. కల్లుకైపులో వానికేం తెలుస్తుంది. మల్లా బుడీకి నేను దుడ్డిస్తేగాని

కలలు: కోరికలు ఆశలు ఆశయాలు
కూడూ గూడూ గుడ్డా చదువూ గిదువూ
గలగల్లాడే నవ్వూ గివ్వూ
అన్నీ అన్నీ ఇంకా మంచివి యెన్నో యెన్నో అన్నీ
ఈ రాజకీయాల్లో --

★ ★ ★

నా చిన్నప్పట్నుంచీ దేశాన
ఇంకా
రాలు కాలమే.

—సైక్రల్



అమ్ముటకు సిద్ధంగా ఉన్నవి
ఇంగ్లీషు-తెలుగు మీడియం డిక్షనరి రు. 21/-
ఇంగ్లీషు-తెలుగు జెమ్ డిక్షనరి రు. 12/-
హిందీ-తెలుగు డిక్షనరి రు. 15/-
తెలుగు-తెలుగు డిక్షనరి రు. 30/-
పోస్టేజి అదనము.
బాలసరస్వతీ బుక్ డిపో,
మద్రాసు-1.
ఫోన్ : 29868

ఉచితము! ఉచితము!
తెల్ల మచ్చలు
అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.
వివరాలు :
BHARAT AYURVEDASHRAM (M)
Post Katri Sarai (Gaya)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్తప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ, రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి : 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు-17

నెరసిన జుట్టు
రంగువల్ల కాదు. మా 'కేశరంజని' ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ నెరసిన జుట్టుకు మామూలు నల్లరంగు నిస్తుంది. పైగా అది మెదడుకు, కళ్ళకు మంచి టానిక్కు. ధర రు. 12/- సంతృప్తి శాశ్వత ఫలితానికి 3 సియల్స్ రు. 27/-
SHYAM AYURVED BHAVAN (S.5)
P.O Katri Sarai (Gaya)




దిక్కులే' అంటూ నవ్వేది.

సోమసుందరం లైటార్పితే కళ్ళు తెరిచి ప్రక్కకు ఒత్తిగిల్లా. "నాకు నిద్రపట్టటం లేదురా, నేను నా గదికి వెళ్తాను." అని లేచి కూర్చున్నాను.

"నీకేం పిచ్చా? టైం ఒంటిగంటన్నర. నోరు మూసుకు పడుకో. నన్ను పడుకోనీ. రేపు ప్రాక్టికల్స్. లాబ్ లో నిలబడలేక చావాలి" అని వాడు దుప్పటి కప్పుకొన్నాడు. పడుకొని

నేను ఆలోచనల్లో ఎప్పుడో నిద్రలోకి జారాను. ప్రొద్దున్నే లేచి మొహమైనా కడుక్కోకుండా నా గదికి బయలుదేరాను. మా వాడు ఇంకా నిద్రపోతున్నాడు. నా గది దగ్గరకు వచ్చేసరికి గుడిసెల దగ్గర జనం కనిపించారు. చాలమందే వున్నారు. ఏమిటోనని వెళ్లాను. ఎవరో చెప్పారు రాత్రి రాములు, రాములమ్మ బాగా తగువులాడుకొన్నారని. రాములు తాగుడు మైకంలో రాములమ్మ పొట్టలో కత్తితో పొడిచాడట. రాములమ్మను ధర్మాసుపత్రిలో పెట్టారట. భగవంతుడా ప్రొద్దున్నే ఇదేం వార్త అనుకొన్నాను. ఎలాగో అలా స్నానం ముగించుకొని, మెస్సుకు వెళ్ళేముందు గవర్నమెంటు హాస్పిటలుకు బయలుదేరాను. అక్కడ జనం కిటకిటలాడుతున్నారు. పోలీసులు న్నారు. రాములు రేగుచెట్టుక్రింద కూర్చుని ముఖాన గుడ్డ కప్పుకొని ఏడుస్తున్నాడు. ప్రక్కనున్నతన్ని అడిగాను ఏమయిందని.

"రాములమ్మ సచ్చిపోయింది. సచ్చే ముందు పోలీసోల్లడిగితే "రాములు గాందేం తప్పులేదు. నేను పానం తీసుకొందామని పొడుసుకున్నా. వాన్నేమీ అనకండి. నాదేముంది, ఒంటికట్టె ఇట్ల పోసిండి' అని చెప్పిందంట.".

నేను రాములమ్మ శవాన్ని చూడలేదు. చూడ్డానికేముంది మార్చురీకి తీసుకెళ్ళాక. కాని ఆమె మాత్రం నా కొక కథానాయికగా కనిపించింది. నా కళ్ళలో నీళ్ళు తెప్పించింది. "ఒథెల్లో" డెస్డిమోనా పీక నొక్కినప్పుడు చనిపోయేముందు "ఇదంతా నేను చేసుకొందే" అని ఎమిలీతో అంటుంది.

"అబద్ధాల కోరు" అంటాడు అసూయ కాటేసిన ఒథెల్లో. ఆ నాటకంలో డెస్డిమోనా ఒక దేవత. ఆమెను శాశ్వతం చేశాడు షేక్స్పియరు. మరి రాములమ్మ గురించి ఎవరు వ్రాస్తారు? దూరంగా ఎక్కడో గాడిద కూస్తోంది "అల్లా...." ❁

